## ఎస్టీ జాబితాలో చేర్చండి



అల్లాపూర్,డిసెంబర్18: బీసీ జాబితాలో ఉన్న వడ్డెర కులాన్ని ఎస్టీలో చేర్చాలని అల్లాపూర్ డివిజన్‌కు చెందిన తెలంగాణ వడ్డెర సంఘం నాయకులు సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కుంచపు వెంకన్న, పిట్ల అంకంరావు, పిట్ల వంశీ తదితరులు ఉన్నారు.

## నేడు గోశాల ప్రారంభం

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 18 : కేపీహెచ్‌బీ కాలనీ గోవర్ధనగిరి కొండపై శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీవారి గోశాలను ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు శ్రీవిరూపాక్ష విద్యారణ్యస్వామిచే గోశాల ప్రారంభోత్సవం ఉంటుందని.. అనంతరం ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తుల కోసం అన్నసమారాధన నిర్వహించనున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి

మియాపూర్ , డిసెంబర్ 18: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని చైతన్యనగర్ సుమిత్రనగర్‌లో సుబ్రహ్మణ్య షష్ఠిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని నాగదేవత ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతకు నివాళి

బాలానగర్, డిసెంబర్ 18 : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దివంగత నేత బండారి ప్రకాశ్‌గౌడ్ వర్ధంతి సందర్భంగా బాలానగర్ కమాన్ వద్ద గల ఆయన విగ్రహానికి కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పుష్పారెడ్డి, నవీన్‌గౌడ్, అబ్దుల్‌బాకీ, రమేశ్, దీపక్, మహేందర్, అనిల్, నజీర్ పాల్గొన్నారు.

## పరికి చెరువును పరిరక్షించాలి

ప్రజావాణిలో ఫిర్యాదు

దుండిగల్, డిసెంబర్18: కుత్బుల్లాపూర్ మండలం జగద్గిరిగుట్ట, లెనిన్‌నగర్, మహాదేవపురం, అల్విన్‌కాలనీ పరిధిలో విస్తరించి ఉన్న పరికి చెరువును పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సోమవారం సీపీఐ శ్రేణులు సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ ఉమా మహేశ్, పార్టీ జిల్లా నాయకులు హరినాథ్‌రావు, కిషన్, శ్రీనివాస్, ప్రవీణ్, వి.శ్రీనివాస్, మండల కార్యదర్శి దుర్గయ్య, మండల నాయకులు ఇమామ్‌రాజు, ఐలయ్య, చారి పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పిస్తాం

అల్లాపూర్, డిసెంబర్18: ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహాబేగం అన్నారు.సోమవారం డివిజన్ పరిధి సప్థర్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్, హరినగర్‌లో పర్యటించిన కార్పొరేటర్ రూ.20లక్షలతో జరుగుతున్న సీసీరోడ్డు, నిర్మాణ పనులను అధికారులతో కలిసి ప్రరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ రాజక్, శివ,యోగిరాజు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ ప్రజల విజయం

### కృతజ్ఞత సభలో ఎమ్మెల్యే వివేకానంద్



మాట్లాడుతున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, డిసెంబర్18 : బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల కృషి, ప్రజల ఆశీర్వాదంతోనే రికార్డు మెజారిటీతో విజయం సాధించానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వివేకానంద్ 85,576 ఓట్ల మెజార్టీతో విజయం సాధించిన నేపథ్యంలో సోమవారం కార్యకర్తలు, నేతలతో కృతజ్ఞత సభ నిర్వహించారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ... ఇది ఒక్కరి గెలుపుకాదని, నియోజకవర్గ ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణుల గెలుపుగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ విజయంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పేరును రాష్ట్ర వ్యాప్తంగా పేరొచ్చేలా చేశారన్నారు. అనంతరం కార్యకర్తలు, నేతలతో కలిసి సహఫంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, దుండిగల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణతో పాటు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## త్రివేణి స్కూలులో 'తానా' అమ్మనాన్న గురువు పద్యార్చన

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 18: చింతల్ త్రివేణి స్కూలులో తానా అమ్మనాన్న గురువు పద్యార్చన కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా 10 లక్షల మంది విద్యార్థులు భాగస్వాములు కాగా..దీనిలో భాగంగా చింతల్ త్రివేణి స్కూల్ విద్యార్థులు, చిగురుమళ్ల శ్రీనివాస్ రచించిన అమ్మశతకం, నాన్న శతకం, గురువు శతకాల్లోని పద్యాలను కంఠస్థం చేసి 750 మంది సామూహిక గానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జి.వీరేంద్రచౌదరి, ప్రిన్సిపాల్ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ నళిని, సీఆర్‌ఓ వెంకట్రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

దుండిగల్,డిసెంబర్18: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, సర్వేనంబర్ 191లోని ప్రభుత్వ భూమిలో వెలిసిన అక్రమ నిర్మాణాలను సోమవారం మండల రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కూల్చివేతల్లో కార్పొరేషన్ ఏసీపీ శ్రీనివాసరావు, టీపీఎస్ ప్రశాంతి షర్పాల్, కవితారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## మూసాపేట సర్కిల్ పరిధిలో..

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 18 : జీహెచ్‌ఎంసీ నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తప్పవని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మల్లేశ్వర్ తెలిపారు. సోమవారం మూసాపేట సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ, డిమాల్‌షేషన్ స్క్వాడ్ సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా చర్యలుంటాయని హెచ్చరించారు.

## అక్రమ నిర్మాణాలను ఆపాలి

- శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి

మియాపూర్ , డిసెంబరు 18 : అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో నిర్మాణాలపై పూర్తి స్థాయి పర్యవేక్షణ లోపం నెలకొన్నదని టాస్క్‌ఫోర్స్, పట్టణ ప్రణాళికా విభాగాలు పకడ్బందీగా పనిచేసి అక్రమ నిర్మాణాలను నిరోధించాలన్నారు. జోన్ స్థాయి పట్టణ ప్రణాళికా విభాగం, టాస్క్‌ఫోర్స్ బృందాలతో జడ్సీ శ్రీనివాస్ రెడ్డి సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో 100కు పైగా భవనాలు అక్రమంగా వెలిసినట్లు గుర్తించి గతంలో నోటీసులు సైతం జారీ చేశామని, తాజాగా బృందాలు వాటి పురోగతిని పరీక్షించి కూల్చివేయాలన్నారు. కొన్ని నిర్మాణాల విషయంలో కొందరు అధికారులపై ఫిర్యాదులు సైతం వస్తున్నాయని, అక్రమ నిర్మాణదారులకు కొమ్ముకాస్తే వారిపైనా చర్యలు తప్పవన్నారు. ఇకపై రోజువారీ కూల్చివేతల ప్రక్రియ చేపట్టాలని, చేపట్టిన చర్యలను నివేదించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీపీ మల్లికార్జున్, ఏసీపీలు సురేందర్‌రెడ్డి, ఖుద్దూస్, ఆయా సర్కిళ్ల ఏసీపీలు, టీపీవోలు, టాస్క్ ఫోర్స్ సభ్యులు, న్యాక్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

## అనాథలకు చేయూత



కేపీహెచ్‌బీ కాలనీలో పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రాణాప్రతాప్

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 18: సమాజంలోని అనాథ వృద్ధులు, చిన్నారులకు చేతనైనంత సాయం చేయాలన్న లక్ష్యంతో 'సేవ్ ఏ లైఫ్.. సేఫ్టీ ఫర్ హ్యూమానిటీ' స్వచ్ఛంద సంస్థ గత పదేండ్లుగా కృషి చేస్తున్నదని వ్యవస్థాపక అధ్యక్షుడు రాణాప్రతాప్ అన్నారు. సోమవారం కేపీహెచ్‌బీ కాలనీ వసంతనగర్‌లోని సంస్థ కార్యాలయంలో 10వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ, రోడ్లపై అనాథలు, పేదలకు అన్నదానం, రాజరాజేశ్వరీ వృద్ధాశ్రమంలో అన్నదానం, వృద్ధాశ్రమానికి ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు తదితరులు ఉన్నారు.

## వీఆర్‌ఎస్ విజ్ఞానజ్యోతి పాఠశాలకు అవార్డు



అవార్డును అందుకుంటున్న పాఠశాల డైరెక్టర్ విజయరాణి

దుండిగల్, డిసెంబర్18 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లికి చెందిన వీఆర్‌ఎస్ విజ్ఞాన జ్యోతి పాఠశాల 'ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు-2023'కు ఎంపికైంది. ఈ నెల 17న బెంగళూర్‌లో జరిగిన ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు కార్యక్రమంలో భాగంగా వీఆర్‌ఎస్ విజ్ఞానజ్యోతి పాఠశాలకు ప్రశంసలు దక్కాయన్నారు. దేశవ్యాప్తంగా మొత్తం 400 పాఠశాలు ఇందులో పాల్గొనగా కేవలం 60 పాఠశాలలను మాత్రమే ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు గుర్తించిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ విజయరాణి మాట్లాడుతూ తమ విద్యాసంస్థకు జాతీయస్థాయిలో ఇంతటి గుర్తింపు లభించడం సంతోషంగా ఉందని తెలిపారు.

## ప్రజా సమస్యలు పరిష్కరిస్తా..



దుండిగల్, డిసెంబర్18: బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ... ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్‌రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు,బీఆర్‌ఎస్ నేతలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు సోమవారం ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

## ఆలయానికి చేరుకున్న అయోధ్య శ్రీరాముడి అక్షింతలు



దుండిగల్,డిసెంబర్18: అయోధ్యలోని శ్రీరామజన్మభూమి ఆలయంలో శ్రీరాంలల్లా విగ్రహ ప్రతిష్ఠాపన జనవరి 22న జరుగుతున్న నేపథ్యంలో సోమవారం 'శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర' ప్రాణప్రతిష్ఠ అక్షింతలు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి... ప్రగతినగర్‌లోని పట్టాభి రామాంజనేయ ఆలయానికి ప్రగతినగర్ సంచాలన సమితి సభ్యులు చేర్చారు. ఆలయ కమిటీ చైర్మన్ చల్లా సుధీర్‌రెడ్డి సమక్షంలో అక్షింతలు ఉన్న కలశానికి పూజలు చేసి ఆలయసన్నిధిలో భద్రపరిచారు. జనవరి 1 నుంచి 15వ తేదీ వరకు కార్పొరేషన్ పరిధిలోని ప్రతిహిందూ కుటుంబానికి అక్షింతలు, అయోధ్య రామాలయం చిత్రపటం, కరపత్రాలు అందజేస్తామని ఈ సందర్భంగా ప్రగతినగర్ సంచాలన సమితి సభ్యులు పేర్కొన్నారు.

బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొన్నం ప్రభాకర్‌ను రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు జిట్టా బాలకృష్ణ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

– కేపీహెచ్‌బీ కాలనీ



## చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 18 : కళాశాలల్లో విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని చెస్ కోచ్ సుబ్బరాజు అన్నారు. సోమవారం జెఎన్‌టీయూ వర్సిటీ ఇండోర్ స్టేడియంలో చెస్ బాలికల జట్టు ఎంపికకు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సుబ్బరాజు మాట్లాడుతూ.. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు అంబేద్కర్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ చెస్ పోటీల్లో వర్సిటీ తరపున పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఎన్.దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ ఎన్.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నెక్సెస్ మాల్‌లో క్రిస్మస్ సందడి

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 18 : కేపీహెచ్‌బీ కాలనీ నెక్సెస్ మాల్‌లో క్రిస్మస్ సందడి నెలకొంది. మాల్‌లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ.. విద్యుత్ దీపాలంకరణ వినియోగదారులను ఆకట్టుకుంటున్నది. క్రిస్మస్ సందర్భంగా ఈనెల 16 నుంచి 31 వరకు ప్రతిరోజూ ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నట్లు మాల్ నిర్వాహకులు తెలిపారు.

